

# గ్రీన్ కార్డ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 2000 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

"**వైనాట్? నా పార్టీ అధ్యక్షురాలు** ఎవరో తెలుసా?"

"ఇంకెవరు? నేనే"

"నువ్వు కాదు. మన ఇంట్లో వంటెవరు చేస్తారు? మాధురీదీక్షిత్. టట్టడాయ్."

"మెచ్చాం" మూతి విరిచింది మానసి.

"దట్సే... పల్లెటూరి పిల్లల లక్షణం అలా మూతి ట్విస్టింగ్స్."

ప్రేమికుల మధ్య కాలం ఎలా దొర్లుతుందో వాళ్ళకి తెలీదు. ఏం మాట్లాడుతున్నారో తర్వాత వాళ్ళకే గుర్తుండదు. ఒకరి సాన్నిధ్యంలో మరొకరు ఎంతసేపు వుండగలమా అన్న ఒక్క కోరికే వాళ్ళని కట్టిపడేస్తుంటుంది.

టైం చూసుకుని చెప్పింది మానసి -

"ఇంక బయలుదేరుదాం."

"ఇంకాసేపు కూర్చోరాదు?"

"రేపనేది వుందిగా. లే"

మానసి లేవడంతో అయిష్టంగా విరించి కూడా లేచాడు. ఇద్దరూ బస్‌స్టాప్‌దాకా నడిచి వెళ్ళారు. మానసి బస్సెక్కాక విరించి తన బస్ కోసం చూడసాగాడు అది రాలేదు. ఓ సెవన్ సీటర్ ఆటో వస్తే అది ఎక్కాడు.

ఇంటికి చేరుకున్నాక గుమ్మంలోనే చెప్పాడు గోపీనాథ్.

"నాన్నగారికి మందులు తీసుకురారా. రాత్రికి లేవు."

విరించి అన్నయ్య స్కూటర్ తీసుకుని దగ్గరే వున్న మందుల షాపుకి వెళ్ళాడు. మందులు కొన్నాక తిరిగి ఇంటికి బయలుదేరాడు. కొద్ది గజాల దూరం వెళ్ళగానే ఎవరో చప్పట్లు కొట్టి పేరుతో పిలవడంతో స్కూటర్‌ని ఆపి ఇంజన్‌ని ఆన్‌లోనే వుంచి తనని ఎవరు పిలిచారా అని చుట్టూ చూశాడు. వెంటనే అది క్షణాల్లో జరిగిపోయింది.

ఇద్దరు వ్యక్తులు విరించి స్కూటర్ దగ్గరికి వచ్చారు. ఒకతను తన చేతిలోని ప్లాస్టిక్ కేన్‌ని ఎత్తి విరించి వంటిమీద అందులోని ద్రవాన్ని కుమ్మరించాడు. వాసనిబట్టి అది పెట్రోల్ అని గ్రహించాడు బిత్తరపోయిన విరించి కొంత స్కూటర్ మీద పడింది.

ఇద్దరిలో ఒకతను జేబులోంచి అగ్గిపెట్టి తీసి వెలిగించాడు. ఆ పుల్ల ఆరిపోవడంతో ఇంకోటి గీసాడు. దారిన పోయే వాళ్ళు దూరంగా నిలబడి ఏం జరుగుతుందా అని భయంతో కూడిన ఆసక్తితో చూస్తున్నారు.

తన వంటి నించి కారే పెట్రోల్, అతని చేతిలోని అగ్గిపెట్టె చూడగానే విరించికి జరగబోయేది అర్థమైంది. మరుక్షణం స్కూటర్‌ని అలాగే వదిలి వెనక్కి తిరిగి పరిగెత్తాడు. గీసిన అగ్గిపుల్లని స్కూటర్ మీద పడేసాడు వాడు. అది భగ్గుమంటోంది. ఇద్దరు విరించి వెంటపడ్డారు. విరించికి అర్థమైంది తను వాళ్ళ చేతికి చిక్కితే సజీవదహనం తప్పదని.

స్కూటర్ మీద వెళ్తున్న ఒకతన్ని బ్రతిమాలాడు, ఆ స్కూటర్ వెంట పరిగెత్తుతూ.

''సార్, సార్. ప్లీజ్ - లిఫ్ట్ ఇవ్వండి. వాళ్ళు నన్ను చంపడానికి వస్తున్నారు.''

అతను విరించి కోరికని మన్నించకుండా భయంగా వేగాన్ని పెంచి వెళ్ళిపోయాడు. ఓ చోట ఆగివున్న ఆటో డ్రైవర్ పరిస్థితి ఆకళింపు చేసుకుని చెప్పాడు ఆటో స్టార్ట్ చేస్తూ.

''ఇస్ మే బైఠో సాబ్.''

విరించి వెళ్ళి అందులో ఓ మూల నక్కి కూర్చున్నాడు. ఆటో కదిలింది.

''ఆటో! స్టాప్... స్టాప్'' అరిచారు విరించి వెంటబడ్డ వాళ్ళు.

ఆటో డ్రైవర్ వాళ్ళ మాటలని లక్ష్యపెట్టకుండా ముందుకు పోనించాడు. ఆటో డ్రయివర్‌కి తన ఇంటి అడ్రస్ లెఫ్ట్ రైట్‌లతో చెప్పాడు భయంతో వణికిపోతున్న విరించి. ఇంటిముందు ఆటో ఆగాక లోపలికి పరిగెత్తుకెళ్ళి అరుస్తూ చెప్పాడు.

''నన్నెవరో పెట్రోల్ పోసి తగలెట్టాలనుకున్నారు.''

''ఏం జరిగింది? ఏమిట్రా ఆ పెట్రోల్?'' ఆశ్చర్యపోయాడు అరుణాచలం కొడుకుని చూసి.

షాక్‌లాంటి దాంట్లో చిక్కుకున్న విరించి ఎక్కువ చెప్పలేకపోతే ఆటో డ్రయివర్ జరిగింది వివరించాడు. అంతా ఆ సందులోకి చూసారు ఎవరైనా వస్తున్నారా అని.

''స్కూటరేది?'' అడిగాడు గోపీనాథ్.

''అక్కడే వదిలి పారిపోయి వచ్చాను.''

గోపీనాథ అదే ఆటోలో అక్కడికి వెళ్ళాడు స్కూటర్ తేవాలని. కానీ అది తగలబడిపోవటం చూసాడు. ఆటో డ్రయివర్ అడిగాడు వాళ్ళకి ఆస్తి తగాదాలు కానీ, ఆడపిల్లల విషయంలో పేచీలు కానీ వున్నాయా అని. దేనికీ బదులు చెప్పలేదు గోపీనాథ్.

మళ్ళీ ఆటో ఇంటికి చేరుకున్నాక విరించిని ఎక్కించుకుని సరాసరి తమ ఏరియా పోలీస్ స్టేషన్ తీసుకెళ్ళాడు.

ఒంటినించి పెట్రోల్ వాసన వస్తున్న విరించి వంక సెంట్రి వింతగా చూసాడు. సరాసరి సి.ఐ గదిలోకి వెళ్ళారు ఇద్దరూ, ఆటో డ్రైవర్‌తో సహా.

''మా తమ్ముడ్ని పెట్రోల్ పోసి కాల్చి చంపాలని ఎవరో యిదరు ప్రయత్నించారు సార్'' చెప్పాడు గోపీనాథ్.

''కూర్చోండి. ఎక్కడ? ఎప్పుడు?'' అడిగాడు సి.ఐ.

ఆ వివరాలకి సమాధానాలు ఇవ్వగానే ఎస్.ఐ.ని, ఇద్దరు కానిస్టేబుల్స్‌ని పిలిచి వాళ్ళని వెంటనే జీప్‌లో అక్కడికి వెళ్ళి నేరస్థులు దొరుకుతారేమో చూడమని పంపాడు. అప్పటికే సి.ఐ.కి ఫోన్ వచ్చింది దాని గురించి.

''ఎవరు నిన్ను చంపాలనుకుంది?'' అడిగాడు విరించిని.

''తెలీదండి.''

''వాళ్ళని ఇంతకుమునుపెన్నడైనా చూశారా?''

''లేదండి.''

''నీకు ఎవరితోనైనా గొడవలున్నాయా?''

"లేవండి."

"నిజం చెప్పు. ఏ గొడవలేకుండా నిన్నెవరూ చంపాలనుకోరుగా? భయంలేదు. అక్రమ సంబంధంలాంటిదేదైనా వుందా?"

"నిజం సార్. అలాంటిదేం లేదండి."

"ఇదివరకు కూడా మా వాడ్ని చంపాలని చూసారు" చెప్పాడు గోపీనాథ్.

ఆ వివరాలు అతను చెప్తూంటే, అప్పుడు కానీ స్ఫురించలేదు. విరించికి - బహుశా ఇది కూడా అన్నయ్య చేసిన ఏర్పాటై వుండచ్చని. అంతదాకా భయం ఆ ఆలోచన్ని కమ్మేసింది. ఆ ఆలోచన వచ్చాక అతనికి ఆందోళన సగం తగ్గింది.

ఆటో డ్రైవర్‌ని జీప్‌లో ఎక్కించుకుని వెళ్ళిన ఎస్.ఐ ఇరవై నిముషాల్లో వచ్చాడు. సాక్షులనించి దుండగుల వర్ణనతో.

"స్కూటర్ పూర్తిగా కాలిపోయింది సార్" చెప్పాడు సి.ఐ.కి.

ఈలోగా సి.ఐ. విరించి మీద హత్యాప్రయత్నాలు గతంలో నమోదైన పోలీస్ స్టేషన్లకి ఫోన్ చేసి మాట్లాడాడు.

ఎఫ్.ఐ.ఆర్ ఓపెన్ చేసి విరించి స్టేట్‌మెంట్, ఆటో డ్రయివర్ స్టేట్‌మెంట్ తీసుకున్నాడు.

"నువ్వు నిజం చెప్పకపోతే, రేపైనా నిన్ను చంపుతారు. కాబట్టి నువ్వు నిజం చెప్పడం నీకే మంచిది" చెప్పాడు సి.ఐ విరించితో.

"నేను మా వాడితో అన్నీ మాట్లాడి రేపు మళ్ళీ వస్తాను" చెప్పాడు గోపీనాథ్.

గోపీనాథ్ ఇంటికి పాయింట్ బుక్‌ని ఏర్పాటు చేశాడు సి.ఐ. తెల్లవారు ఝామున బీట్ కానిస్టేబుల్ వచ్చి అందులో సంతకం చేయించుకుని వెళ్తాడు.

అదే ఆటోలో ఇంటికి బయలుదేరాక అడిగాడు విరించి మెల్లిగా.

"అన్నయ్యా!ఇదీ అలాంటిదేనా?"

"అవును ముందు నీకు చెప్పలేదు"

"ఎందుకు చెప్పలేదు? అది తట్టక ఎంత వణికిపోయానో తెలుసా?"

"సి.ఐ ముందు అలా వణకాలనే ముందు చెప్పలేదు."

"చాలా ఖర్చు చేస్తున్నావ్. ఇదంతా దేనికి?"

"మరో నాలుగు రోజులు ఓపిక పట్టు."

ఆటో డ్రైవర్‌కి అయిదువందలు యిచ్చాడు అరుణాచలం, తన కొడుకు ప్రాణాలు కాపాడినందుకు కృతజ్ఞతగా.

విరించి స్నానం చేసి వచ్చాక నవ్వుతూ చెప్పాడు గోపీనాథ్.

"శుభ్రంగా పెట్రోల్ వాష్ అయ్యాక ఎంత తెల్లగా అయ్యాడో"

"ఇది నీకు నవ్వులాటగా వుందా?" అరిచింది మాలతి అసహనంగా.

ఆవిడ కోపానికి నవ్వొచ్చి కొడుకులిద్దరూ నవ్వుతూండటం చూస్తే ఆవిడకి ఏం పాలుపోలేదు.

యధావిధిగా మర్నాడు పేపర్లో వచ్చిన ఆ వార్తని కట్ చేసి ఎవిడెన్స్ ఫైల్‌లో వుంచాడు గోపీనాథ్ తమ్ముడ్ని తీసుకుని డి.సి.పి కార్యాలయానికి వెళ్ళాడు. దారిలో తమ్ముడికి ఏం మాట్లాడాలో బ్రీఫింగ్ ఇచ్చాడు.

వాళ్ళు తమ్ముడి పేరు, వచ్చిన పని కాగితం మీద రాసి లోపలికి పంపగానే డి.సి.పి వెంటనే ఇద్దర్నీ లోపలికి పిలిచాడు.

గోపీనాథ్ తన తమ్ముడి మీద జరిగిన మూడు హత్యాప్రయత్నాలను గురించి చెప్పాడు.

"ఎవరి మీద మీ అనుమానం?"

"ఐ.ఎస్.ఐ వాళ్ళు నన్ను చంపాలనుకుంటున్నారండి" జవాబు చెప్పాడు విరించి ఆయనకి.

"ఐ.ఎస్.ఐ?" ఆశ్చర్యంగా అడిగాడాయన.

"అవున్సార్."

"నీకెలా తెలుసు వాళ్ళు ఐ.ఎస్.ఐ వాళ్ళని?"

ఓ జిరాక్స్ కాగితం ఇచ్చి చెప్పాడు విరించి.

"ఇది వాళ్ళనించి నాకు వచ్చిన ఉత్తరంసార్."

గతంలో విరించి ఎడ్రస్‌కి గోపీనాథ్ రిజిస్టర్ పోస్ట్‌లో పంపిన ఉత్తరాల్లో ఒకటి. ఇంగ్లీష్‌లో చేత్తో రాసి వుందా ఉత్తరం.

తమకి చెందిన కాగితాలు వెంటనే తమ మనిషికి అందచేయాలని, లేకపోతే అతన్ని చంపడం తప్పదని ఆ లెటర్ సారాంశం. గపూర్ అనే సంతకం వుంది.

"ఇందులో ఐ.ఎస్.ఐ అన్న పేర్లు ఎక్కడా రాసిలేదుగా?" అడిగాడాయన.

"వాళ్ళు నాతో ఓరల్‌గా చెప్పారు సార్."

"అసలు వాళ్ళకీ నీకూ ఎలా పరిచయం?" అడిగాడాయన.

"నేనో జిరాక్స్ షాపు నడుపుతున్నాను సర్. రోజూ అనేకమంది కస్టమర్స్ వచ్చి అనేక పేపర్లు జిరాక్స్ తీసుకుని వెళుతుంటారు. రెండు వారాల క్రితం అనుకుంటా ఇద్దరు వచ్చి క్రితం రోజు తాము జిరాక్స్ తీయించుకోడానికి వచ్చినప్పుడు ముఖ్యమైన కాగితాలున్న జిప్‌బేగ్‌ని మర్చిపోయి వెళ్ళామని, ఆ బేగ్ ఇవ్వమని అడిగారు. ఎవరూ అలాంటి బేగ్స్ మర్చిపోలేదు కాబట్టి అదే చెప్పాను. చాలా ముఖ్యమైన కాగితాలని చెప్పి, నేనువారిస్తున్నా వినకుండా నా షాపంతా వెతికారు. ఆ బేగ్ దొరకలేదు వాళ్ళకి. మళ్ళీ రాత్రిషాపు మూసేస్తుండగా వచ్చారు. ఓ పిస్తోలు చూపించి ఆ బేగ్‌ని మర్యాదగా ఇస్తావా లేక యిక్కడే కాల్చేయమా అని అడిగారు. నిజంగా నాకెలాంటి కాగితాలున్న బేగ్ షాపులో దొరకలేదని చెప్పాను. ఇరవై నాలుగ్గంటలు టైం యిస్తున్నామని చెప్పారు. తాము ఐ.ఎస్.ఐ వాళ్ళమని కూడా చెప్పారు."

"పోలీసులకి యిది రిపోర్టు చేశావా?"

"మా ఏరియా పోలీస్ స్టేషన్‌లో చెప్పాను సార్. వాళ్ళు సీరియస్‌గా తీసుకోలేదు."

"కాగితం మీద రిపోర్ట్ చేశావా?"

"లేదు. ఓరల్‌గా చెప్పానంతే. వాళ్ళసలు పట్టించుకుంటేనా?"

"తర్వాత?"

"మర్నాడు జిరాక్స్ షాప్‌కి కాకుండా నేను కంప్యూటర్ నేర్చుకునే ఇన్‌స్టిట్యూట్‌లోంచి బయటకి రాగానే ఆ ఇద్దరూ వచ్చి ఆ కాగితాలేం చేసావని చితక్కొట్టారు సార్. నాకు తెలీదంటే చంపబోయారు. ఈలోగా ఆ సందులోకి ఓ కారు వచ్చింది. ఆ కారు ఆపి అందులోంచి నలుగురు దిగగానే వాళ్ళు పారిపోయారు."

"ఇది రిపోర్ట్ చేశాడు సర్ మా వాడు. ఎఫ్.ఐ.ఆర్ తెరిచారు" చెప్పాడు గోపీనాథ్.

"ఐ.సీ. తర్వాత?"

"తర్వాత ఓ ఉత్తరం వచ్చింది, ఆ కాగితాలు యివ్వకపోతే ప్రాణాలు తీస్తామని. అన్నట్టుగానే నేను సెకండ్ షో సినిమా చూసి వస్తూంటే కూకట్‌పల్లి దగ్గర నన్ను కత్తితో పొడిచి చంపబోయారు. ఎలాగో తప్పించుకున్నాను."

"కూకట్ పల్లి పి.ఎస్.లో నమోదైన ఆ ఎఫ్.ఐ.ఆర్ కాపీ చూసాను. తర్వాత?" అడిగాడు డి.సి.పి ఆసక్తిగా.

"నిన్న వాళ్ళు పెట్రోల్ పోసి నన్ను కాల్చి చంపబోతే మళ్ళీ తప్పించుకున్నాను. నా స్కూటర్‌ని కాల్చేశారు. ఆ కాగితాలేమిటో, ఆ గొడవేమిటో నాకు తెలీదు సార్."

"కనబడినప్పుడల్లా ఐఎస్.ఐ ఏజంట్లం అని అంటున్నారట సర్" చెప్పాడు గోపీనాథ్.

"ఐ.సీ... అయితే ఆ జిప్‌బేగ్ గురించి నీకేం తెలీదన్నమాట."

"తెలీదు సర్."

ఆయన కొద్దిసేపు మౌనంగా ఆలోచించాడు. తర్వాత చెప్పాడు.

"వాళ్ళు ఐ.ఎస్.ఐ ఏజంట్లు అయివుండరు అయితే అలా డైరెక్టగా చెప్పరు తామెవరో. ఇంకెవరో ఆ పేరుతో నిన్ను బెదిరిస్తూ వుండి వుంటారు."

"వాళ్ళ పేరేదయినా బాధితుడ్ని నేనేకదా సర్?" చెప్పాడు విరించి ఏడుపు గొంతుతో.

చిన్నగా దగ్గి అడిగాడు గోపీనాథ్.

"మా వాడికి పోలిస్ ప్రొటెక్షన్ పెట్టండి సర్."

"ఇంత చిన్నదానికి పోలీస్ ప్రొటెక్షనా?"

"ఇంతదాకా మూడుసార్లు చావు తప్పించుకున్నాడు. ఇది చిన్నదెలా అవుతుంది సర్?"

"వ్యక్తిగత పొట్లాటల్లో ఎంతోమంది కొట్టుకుంటుంటారు. అలా అడిగిన ప్రతీవాళ్ళకి ప్రొటెక్షన్ ఎక్కడనించి యివ్వగలం?"

"పౌరుల్ని రక్షించాల్సిన బాధ్యత పోలీసులదే కదా సర్?"

"కాగితాల్లో కావచ్చు. కానీ అది ప్రాక్టికల్‌గా చేయలేం."

విరించి ఓ కవర్ డి.సి.పికి అందించి చెప్పాడు.

"పోలిస్ ప్రొటెక్షన్ అప్లికేషన్ తెచ్చాను సర్. పోలీస్ కమీషనర్ ణకి పంపిన అప్లికేషన్ కాపి యిది. దయచేసి మీరు రికమండ్ చెయ్యండి సర్."

ఆయన దాన్ని చదివి తన ఇనీషియల్ వేసి చెప్పాడు.

"రిజెక్ట్ అవుతుందిది."

"జడ్ ప్లస్ లాంటిది అక్కర్లేదు సార్. మామూలు ప్రొటెక్షన్. ఆయన పకపకా నవ్వి చెప్పాడు.

"జడ్‌ప్లస్ ఎవరికిస్తారనుకున్నావు? ప్రధాని, మాజీ ప్రధాని, రాష్ట్రపతులలాంటి వాళ్ళకి మాత్రమే. బుల్లెట్ ప్రూఫ్ కారు, పైలట్ కారు, రెండు ఎస్కార్ట్ వెహికిల్స్ ఆరుగురు పోలీసులు నువ్వడిగేది 'ఎక్స్‌టూ' రక్షణ కేటగిరి కింద వస్తుంది. దానిమీద ఆశ వదులుకోవచ్చు."

"అలా అంటే ఎలా సార్?" అడిగాడు గోపీనాథ్ బతిమాలుతున్న ధోరణిలో.

"దేశ రక్షణ, టెర్రరిస్ట్‌లని ఎదుర్కోవాల్సిన రక్షణ దళం పూర్తిగా రాజకీయ నాయకుల ప్రొటెక్షన్‌కే పరిమితమైపోతోంది అని పేపర్లు గోల పెడుతున్నాయి. ఏటా ఏడువందల ఏభై కోట్లు ఖర్చు అవుతున్నా వీళ్ళకే పూర్తిగా రక్షణ యివ్వలేకపోతున్నాం. ఇక ప్రైవేట్ సిటిజన్స్‌కి కూడా ప్రొటెక్షన్ ఇస్తూ పోతే మా ఉద్యోగాలు గూర్ఖా ఉద్యోగాలతో సమానం అవుతుంది" కఠినంగా చెప్పినా నవ్వుతూ చెప్పాడాయన.

"కనీసం వాళ్ళని పట్టుకోండి సార్" అభ్యర్థించాడు విరించి.

"ఆ ప్రయత్నం ఎటూ చేస్తాం. ఐ.ఎస్.ఐ అని బెదిరించారంతే. ఏం భయపడక. ఏవో ముఖ్యమైన డాక్యుమెంట్లు ఎక్కడో పారేసుకుని నీమీద అనుమానం పెంచుకున్న ఏ బిల్డరో, రియల్ ఎస్టేట్ వ్యాపారో అయి వుంటాడు. వాళ్ళే ఇలా హైహేండెడ్‌గా బిహేవ్ చేసేది. నేను చూస్తాగా. వెళ్ళండి" ధైర్యం చెప్పాడాయన.

ఇద్దరూ బయటికి వచ్చాక గోపీనాథ్ తృప్తిగా నిట్టూర్చి చెప్పాడు.

"గుడ్ మనం అనుకున్నట్టే అయింది."

తన ఇన్‌బాక్స్‌లో వచ్చిన మెయిల్స్‌లో 'KREA8VE' నించి వచ్చిన మెయిల్‌ని చూడగానే హుషారుగా దానిమీద మౌస్‌ని క్లిక్ చేసి ఓపెన్ చేశాడు గోపీనాథ్.

అమెరికాలోని సునీత నించి వచ్చిన ఆ రిప్లైలో కింద భాగంలో క్రితం రోజు గోపీనాథ్ పంపిన మెయిల్ కూడా వుంది. గోపీనాథ్ అడిగిన సహాయం చేయడానికి తను సిద్ధమేనని, రిస్కే అయినా ఆ పాటి సహాయం చేయకుండా వుండలేనని రాసింది. కింద సునీత భర్త 'హాయ్! హౌ ఆర్ యూ డూయింగ్?' అని టైప్ చేసిన ఇంకో లెటర్ కూడా చదివాడు.

రిప్లైని క్లిక్ చేసి 'థాంక్స్ ఎలాట్' అని టైప్ చేసి సెండ్ మీద క్లిక్ చేశాడు గోపీనాథ్. అంతదాకా అన్నీ తను అనుకున్నట్లుగానే సాగుతున్నందుకు సంతోషం వేసింది గోపీనాథ్‌కి.

## 9

ప్రతీసారి అడుగుదామనుకుంటూ మర్చిపోతున్నాను. పేపర్లో విరించి అని పడే పేరు నీదేనా?"

"హత్యాప్రయత్నం ఎట్సెట్రాలయితే నా పేరే."

"అమ్మో! ఎన్నడూ నీవు చెప్పనేలేదే? ఎవరికి నీమీద అంత కక్ష?" అడిగింది మానసి గాభరాగా.

"వుంటేగింటే మీ నాన్నకో లేదా మీ అన్నయ్యకో వుండి వుంటుంది."

"జోక్ కాదు నిజం చెప్పు."

"ఫోన్‌లో కాదు. కానీ మనం కలిసినప్పుడు చెప్తాను."

క్లుప్తంగా మొత్తం వివరించాక చెప్పాడు విరించి.

"మా అన్నయ్య అసలిదంతా ఎవరికి చెప్పొద్దన్నాడు. కానీ నీకు చెప్పేశాను."

"దటీజ్ టూ బేడ్ పోలీసులకి నిజం తెలిస్తే మొత్తం నీమీదకే ఎదురు తిరుగుతుంది. తెలుసా?"

"తెలుసు."

"అప్పుడు అమెరికాకి వెళ్ళకపోగా ఇండియాలో జైలు గోడలు చూస్తూ గడపాలి."

"భారం అంతా మా అన్నయ్య మీదే వేశాను."

"అమెరికాకి వెళ్ళడానికి ఇంత రిస్కు తీసుకోవడం దేనికి?"

"రిస్కు అనుకుంటే ఇంగ్లండ్‌నించి మొదటి ఓడ సముద్రం మీద బయలుదేరి ఇండియాకి వచ్చేదేకాదు. ఈ ప్రపంచంలో ఏ అభివృద్ధి వెనక రిస్కు లేదో నాకు చెప్పు?"

"అయితే ఎప్పుడు అమెరికాకి నీ ప్రయాణం?" అడిగింది మానసి.

"త్వరలోనే."

"అయితే వెళ్ళాక నీవు తిరిగి ఇండియా వచ్చేది గ్రీన్‌కార్డ్‌తోనేనన్నమాట?"

"అవును. అందుకు ఏడెనిమిదేళ్ళు పట్టచ్చంటున్నాడు మా అన్నయ్య" దిగులుగా చెప్పాడు విరించి.

"నువ్వెళ్ళేలోగా మన పెళ్ళి అసాధ్యం. మావాళ్ళింత త్వరగా చెయ్యరు."

"మనం ఈలోగా ఇఫ్ ఐకెన్ కిస్‌యూ, నీవు నాకోసం అమెరికాకి వస్తావని ఆశ. ఎంగిలి పడేలా నిన్ను కిస్ చేశాక నీవు ఇంకొకర్నెలా వివాహం చేసుకోగలవు చెప్పు?"

"మనం ఏ ఆర్యసమాజంలోనో చేసేసుకుందాం. మీ వాళ్ళకు చెప్పకు. నీవు అమెరికా వచ్చాక చెబుదువుగాని."

"ఆలోచిద్దాం."

"ఆలోచించి ఏం చేద్దామో చెప్పు. మోస్ట్ ప్రాబబ్లీ యింకో నెల్లో నేను అమెరికా వెళ్ళిపోతాను."

"దటీజ్ బేడ్ ఇదంతా ముందే నాతో ఎందుకు చెప్పలేదు?" అసహనంగా అడిగింది మానసి.

"చెప్పాగా, మా అన్నయ్య ఎవరికీ చెప్పద్దన్నాడని."

"నాకు చెప్పచ్చుగా?"

"నీవు ఇతకు ముందే అడిగి వుండచ్చుగా?"

"ఇంతకు ముందు పేపర్లో ఆ న్యూస్ రాలేదుగా. నిన్నెవరో చంపాలనుకుంటున్నారని పోలీసులని ప్రొటెక్షన్ అడిగినా ఇవ్వమన్నారన్నమాట."

"అవును. ఇవ్వడం కుదరదని డి.సి.పి.ఓరల్‌గా చెప్పాడు. తర్వాత రిప్లయ్ ఇస్తూ కాగితం మీద అదే చెప్పాడు. అఫ్‌కోర్స్ - మాక్కావలసింది అదేమరి"

"ఇదంతా అయోమయంగా వుంది నాకు."

"ఇది సక్సెస్‌ఫుల్ ఐగా పూర్తయ్యేదాకా నాకు అయోమయంగానే వుంది. మా అన్నయ్య ఏదీ పూర్తిగా చెప్పడు. ఇలా చెయ్యి అంటాడంతే."

ఆ ఇద్దరు ప్రేమికులు కొద్దిగా బాధగానే విడిపోయారారోజు.

గోపీనాథ్ తన బంధువయిన ఎస్. ఐ శివాజీతో చర్చించాడా విషయం. తన తమ్ముడికి ఆత్మరక్షణ కోసం రివాల్వర్‌కి లైసెన్స్ కోసం ఎవరికి అప్లికేషన్ పెట్టుకోవాలి అన్న విషయం అది.

"పోలీస్ కమీషనర్‌కి పెట్టుకోవాలి. ఆ అప్లికేషన్ పెట్టి లాభం వుండదు. తన తమ్ముడికి ఆత్మరక్షణ కోసం రివాల్వర్‌కి లైసెన్స్ కోసం ఎవరికి అప్లికేషన్ పెట్టుకోవాలి అన్న విషయం అది.

"పోలీస్ కమీషనర్‌కి పెట్టుకోవాలి. ఆ అప్లికేషన్ పెట్టి లాభం వుండదు. పదిమందిలో ఒకరిద్దరికే లైసెన్స్ ఇస్తారు. అదీ ఆ డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ ఐ.జి. ప్రత్యేకంగా రివాల్వర్‌కి లైసెన్స్ వస్తుందని గేరంటీ లేదు. ఫ్యాక్షనిస్ట్‌లు ఎక్కువగా రివాల్వర్‌కి లైసెన్స్ అడుగుతారు. వాళ్ళ దగ్గర ఆయుధాలు వుండటం ప్రమాదం కదా."

"అసలు ప్రొసీజర్ ఏమిటి?" అడిగాడు గోపీనాథ్.

"అప్లికేషన్‌ని పోలీస్ కమీషనర్‌కి పెట్టుకోవాలి. ఆ అప్లికేషన్ పెట్టి లాభం వుండదు. పదిమందిలో ఒకరిద్దరికే లైసెన్స్ ఇస్తారు. అదీ ఆ డిస్ట్రిక్ట్ ఇంటిలిజెన్స్ ఐ.జి ప్రత్యేకంగా రివాల్వర్ అవసరం అతనికుందని రికమెండ్ చేస్తేనే. అది వున్నా రివాల్వర్‌కి లైసెన్స్ అడుగుతారు. వాళ్ళ దగ్గర ఆయుధాలు వుండటం ప్రమాదం కదా."

"అసలు ప్రొసీజర్ ఏమిటి?" అడిగాడు గోపీనాథ్.

"అప్లికేషన్‌ని పోలీస్ కమీషనర్‌కి లేదా జిల్లా సూపరింటెండెంట్‌కి ఇవ్వాలి. అందులో రివాల్వర్ అవసరం ఎందుకో వివరించాలి. ఒకవేళ లైసెన్స్ మంజూరు చేస్తే పదహారు రూపాయల చలాన్ కట్టాలి. లైసెన్స్ వచ్చిన రోజు నించి మూడునెలలోగా రివాల్వర్ కొని తీసుకెళ్ళి కమీషనర్‌కి చూపిస్తే దాని నంబరు, ఇతర వివరాలు రాసుకుంటారు. ఒకవేళ మూడు నెలలలోగా రివాల్వర్ కొనలేకపోతే యింకో నెల గడువు ఇవ్వచ్చు. బట్ అది మాగ్జిమమ్ పీరియడ్."

విరించిచేత రివాల్వర్‌కి లైసెన్స్ కోసం అప్లికేషన్ పెట్టించాడు గోపీనాథ్. అతనాశించినట్లుగా అది తిరస్కరించబడింది. తమ పథకం విజయవంతం అవడానికి ఆ కాగితాన్ని ఎవిడెన్స్ ఫైల్లో వుంచాడు గోపీనాథ్.

గోపీనాథ్ బంధువొకతను ఓ ఇంగ్లీష్ దినపత్రికకి ఫ్రీలాన్స్ రైటర్‌గా ఆర్టికల్స్ పంపుతుంటాడు. ఆ రోజు వుదయం గోపీనాథ్ అతనింటికి వెళ్ళి చెప్పాడు.

"నాకో చిన్న సహాయం కావాలి."

"ఏం కావాలా?" అడిగాడాయన. ఆయన పేరు సుబ్రమణ్యం.

"లెటర్ హెడ్స్ డిజైన్ చేసే వాళ్ళెవరయినా నీకు తెలుసా? నువ్వా లైన్‌లో వున్నావు కాబట్టి నీకు ఆర్టిస్ట్స్ తెలుస్తారు కదా?"

"దానికేం భాగ్యం. నేను లెటర్ రాసిస్తాను. కృష్ణప్రసాద్ అనే అతను బొమ్మలు గీస్తుంటాడు. అతను కమర్షియల్ ఆర్ట్‌వర్క్ కూడా చేస్తుంటాడు."

"నాకింకో సహాయం కూడా కావాలి. మా యింటి అడ్రస్ ఇస్తా. అమెరికానించి పోస్ట్‌లో వుత్తరాలొస్తాయి. 'హీరాలాల్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే పేర అవి వస్తే నాకు ఫోన్ చేసి చెపితే నేను వచ్చి తీసుకువెళతాను."

"అలాగే."

ఆయన రాసిచ్చిన ఆ లెటర్ కృష్ణప్రసాద్ అడ్రస్‌తో గోపీనాథ్ రాష్ట్రపతి రోడ్‌లోని ఆ ఆర్టిస్ట్‌ని కలిశాడు. ఆ లెటర్ చదివి అడిగాడు.

"కంపెనీ వివరాలివ్వండి."

గోపీనాథ్ రాసిచ్చిన కాగితంలోని వివరాలు చదివాక చెప్పాడు.

"హీరాలాల్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఓ.కె. రేపు సాయంత్రం వచ్చి కలెక్ట్ చేసుకోండి."

అతనడిగిన డబ్బు చెల్లించాడు గోపీనాథ్. మర్నాడు సాయంత్రం అతను చెప్పిన టైంకి వెళ్ళి కంప్యూటర్ తాలూకు మానిటర్ స్క్రీన్‌లో రంగుల్లో వున్న తను డిజైన్ చేసిన లెటర్ హెడ్‌ని చూపించి అడిగాడు ప్రసాద్.

"ఏదైనా మార్పులు కావాలంటే చెప్పండి."

"బాగానే వుంది."

దాన్ని కలర్ ప్రింట్‌లో రెండు ప్రింటవుట్స్ తీసిచ్చాడు కృష్ణప్రసాద్. గోపీనాథ్ అక్కడ నించి సరాసరి ఓ బేబి ఆఫ్‌సెట్ ప్రెస్‌కి వెళ్ళి ఆ లెటర్ హెడ్స్ వంద కావాలని చెప్పాడు. ఆఆ డిజైన్‌ని పరిశీలించి అడిగాడు అతను.

"మూడు రంగుల్లో కావాలా?"

"అవును. ఎప్పుడిస్తారు?"

"రేపు ఈవినింగ్."

గోపీనాథ్ అతనికి ఎడ్వాన్స్ చెల్లించి చెప్పాడు.

"రేపు సాయంత్రానికల్లా తప్పనిసరిగా ఇవ్వాలి."

"అలాగే సార్" చెప్పాడతను.

అయితే మరో రెండుసార్లు తిప్పించుకుని మూడోరోజు యిచ్చాడతను. డి.టి.పి షాపుకి వెళ్ళి ఇంగ్లీషులో మూడు లెటర్స్‌ని ఆ లెటర్ హెడ్స్ మీద టైప్ చేయించాడు. అమెరికాలోని క్వాంటమ్ కెమికల్స్ ఇన్ కార్పొరేషన్ అనే సంస్థ చిరునామాకి, తమ కంపెనీ పర్చేజ్ ఆఫీసర్‌ని చర్చలకోసం పంపడానికి ఏ తారీకులు వీలైనవో తెలియజేయవల్సిందిగా ఆ లెటర్ కంటెంట్.

చిరునామాలని కూడా రెండు కవర్ల మీద టైప్ చేయించాడు. కవర్ మీద కైండ్ అటెన్షన్ - వైస్ ప్రెసిడెంట్, పర్చేజెస్, అని టైప్ చేయించాడు. టైప్ చేసిన లెటర్ మీద పేరు కనబడకుండా గీతలతో సంతకం చేశాడు. తగిన పోస్టల్ స్టాంప్స్ అతికించి రిజిస్టర్ పోస్ట్ చేశాడు.

అదేరోజు సాయంత్రం ఇ-మెయిల్ బూత్‌కి వెళ్ళి అమెరికాలోని సునీతకి తను రెండు లెటర్స్ పోస్ట్ చేసిన సంగతి మెసేజ్ యిచ్చాడు. ఆ లెటర్‌కి ఆమె పనిచేసే క్వాంటమ్ కెమికల్స్ ఇన్ కార్పొరేషన్ కంపెని లెటర్ హెడ్ మీద ఏ జవాబు కావాలో కూడా ఆ ఇ - మెయిల్‌లో నమునా యిస్తారు. గోపీనాథ్ ఆ విధంగా తన తమ్ముడు విరించిని అమెరికా పంపడానికి వీసాకోసం ప్రయత్నం ప్రారంభించాడు.

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**